సాక్షి
చిత్తూరు
మంగళవారం ¡ 20 ¡ ఆగస్టు ¡ 2024



శభాష్ డాక్టరమ్మ

తొలికాన్పులో సిజేరియన్ అయిన మహిళకు రెండో కాన్పు నార్మల్ డెలివరీ చేసిన డాక్టరమ్మ శభాష్ అనిపించుకున్నారు. - 8లో



కలెక్టర్‌కు వినతుల వెల్లువ

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు వెల్లువలా వచ్చాయి. - 8లో



అశ్రునయనాలతో...

నీటి కుంటలో పడి మృతి చెందిన తల్లీ కుమార్తెకు సోమవారం అశ్రునయనాలతో వీడ్కోలు పలికారు. - 8లో

న్యూస్‌రీల్

ఆ కిరాతకులను శిక్షించాలి



ఆస్పత్రిలో కొనసాగుతున్న వైద్యుల దీక్ష

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కోల్‌కతాలో మహిళా వైద్యురాలిని హత్య చేసిన అతి కిరాతకులను కఠినంగా శిక్షించాలని పీజీ డాక్టర్లు డిమాండ్ చేశారు. చిత్తూరు నగరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని పీజీ డాక్టర్లు చేపడుతున్న దీక్ష సోమవారం కొనసాగింది. ఓపీలకు స్వస్తి పలికి న్యాయపోరాటానికి నడుంబిగిస్తున్నారు. మహిళా వైద్యురాలి హత్యకు కారకులైన వారిని వదిలిపెట్టకూడదన్నారు. దేశ వ్యాప్తంగా పనిచేస్తున్న మహిళా వైద్యులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. వీరికి జిల్లా ఎన్‌జీఓ మహిళా సంఘం సభ్యులు, హెడ్‌నర్సులు రాణి, బేబి, రామక్రిష్ణలతో పాటు పలువురు మద్దతుపలికారు. ఈ దీక్షలో చంద్రశేఖర్, మొగిలేష్, నవీన్, రెడ్డితేజ, కావ్య, మేఘన, శివ, క్రిష్ణ, గోపినాథ్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

22న సంకటహర చతుర్థి వ్రతం

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఈ నెల 22న సంకటహర చతుర్థి వ్రతాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈవో వాణి తెలిపారు. ఉదయం 10 నుంచి 11 వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు వ్రత పూజలు జరుగుతాయన్నారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ రథోత్సవం ఉంటుందన్నారు. వ్రతంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న భక్తులు ఆన్‌లైన్‌లో టికెట్లు పొందవచ్చని ఆమె పేర్కొన్నారు.

గణనాథుని సేవలో తెలంగాణ ఉపలోకాయుక్త



నిరంజన్ రావుకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న అధికారులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని సోమవారం తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఉప లోకాయుక్త వి.నిరంజన్ రావు దర్శించుకున్నారు. ఉదయం ఆయన కుటుంబ సమేతంగా విచ్చేయగా ఆలయ సూపరింటెండెంట్ వాసు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులచే ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, తవణంపల్లి తహసీల్దార్ సుధాకర్ పాల్గొన్నారు.

జీతాలివ్వండి బాబూ..

సర్కారు బడుల్లోని చిరుద్యోగులు జీతాలు అందక అవస్థలు పడుతున్నారు. కంటి మీద కునుకేయకుండా కాపు కాసినా ఈ ప్రభుత్వానికి కనికరం లేదు. నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకుండా వేధిస్తోంది. వారి కుటుంబ పోషణకు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేయాల్సిన పరిస్థితి. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో చిరుద్యోగుల ఆకలి కేకలు వినేవారే కరువయ్యారు. గత ప్రభుత్వ హయాంలో నెల మొదట్లోనే జీతాలందడంతో వారి కుటుంబపోషణ సాఫీగా సాగిపోయింది. ప్రస్తుతం వారికి జీతాలు అందక అవస్థలు పడాల్సిన దుస్థితి ఎదురవుతోంది.

చిరుద్యోగుల జీతాల కోసం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు (ఫైల్)



నాలుగు నెలలుగా జీతాలు లేవు

చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 1,908, ప్రాథమికోన్నత పాఠశాలలు 206, ఉన్నత పాఠశాలలు 330 మొత్తం 2,444 పాఠశాలలున్నాయి. తిరుపతి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 1,818, ప్రాథమికోన్నత పాఠశాలలు 195, ఉన్నత పాఠశాలలు 281 మొత్తం 2,294 పాఠశాలలున్నట్లు అధికారిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌మన్‌లకు నాలుగు నెలలుగా జీతాలివ్వడం లేదు. ప్రభుత్వం ఆయాలకు రూ.11.84 కోట్లు, వాచ్‌మెన్‌లకు 8.72 కోట్లు నిధులను మంజూరు చేయాల్సి ఉంది.



- చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరులోని జెడ్పీ హైస్కూల్లో ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు 310 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలలో మరుగుదొడ్ల శుభ్రత కోసం ఇద్దరు ఆయాలను, నైట్ వాచ్‌మెన్‌ను నియమించారు. వారికి గత ఏప్రిల్ నుంచి జీతాలు ఇవ్వడం లేదు. నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఆ చిరుద్యోగులు తమ సమస్యను ఎవ్వరికి చెప్పుకోవాలో అర్థంకాక ఇబ్బందులు పడుతున్నారు.

- తిరుపతి జిల్లా చంద్రగిరిలోని బాలికల జెడ్పీ హైస్కూల్లో ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు 660 మంది చదువుతున్నారు. ఈ పాఠశాలలో ముగ్గురు ఆయాలు, ఒక వాచ్‌మెన్ విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి గత నాలుగు నెలలుగా జీతాలు లేకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జీతాలను వెంటనే విడుదల చేయాలని వారు కోరుతున్నారు.



- చిరుద్యోగుల ఆకలి కేకలు
- ప్రభుత్వ బడుల్లోని ఆయాలు, వాచ్‌మెన్‌లకు అందని జీతాలు
- కుటుంబం గడవక అవస్థలు పడుతున్న వైనం
- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వేతనాల కోసం ఎదురుచూపులు
- పట్టించుకోని పాలకులు, విద్యాశాఖ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : ఇల్లు గడవడం కోసం పాఠశాలల్లో పారిశుధ్య పనులకు చేరారు. గత ప్రభుత్వ హయాంలో నెల మొదట్లోనే పారిశుధ్య కార్మికులకు జీతం ఇచ్చేసేవారు. కుటుంబం గడుస్తుందనే ఆశతో వేలాది మంది ఆయాలుగా, వాచ్‌మెన్‌లు పనిచేస్తున్నారు. అయితే వారిపై కొత్త ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. వారు చేసే కష్టాన్ని ఏ మాత్రం గుర్తించకుండా నిర్లక్ష్యం చేస్తోంది. వారి ఆకలి కేకలు చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌లకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జీతాలు పెండింగ్‌లో పెట్టారు. నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో వారి కుటుంబాలు దయనీయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ప్రభుత్వ బడుల్లో విధులు నిర్వహిస్తున్న ఆయా, నైట్ వాచ్‌మెన్‌ల ఆకలి కేకలు ప్రభుత్వానికి వినపడడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పులు చేసి కుటుంబ పోషణ

నెలవారీగా ఆయాలకు, నైట్ వాచ్‌మెన్‌లకు జీతాలు ఇవ్వకపోవడంతో అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వడ్డీలకు అప్పు తీసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారు. జీతాలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని వారు ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఆయాలకు, నైట్‌వాచ్‌మెన్‌లకు రూ.6 వేలు నెలకు ప్రభుత్వం జీతం మంజూరు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు ఒక్కొక్కరి రూ.24 వేలు జీతం పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడిస్తున్నారు.

చిరుద్యోగుల వివరాలు

- చిత్తూరు జిల్లాలోని పాఠశాలలు 2,444
- తిరుపతి జిల్లాలోని పాఠశాలలు 2,294
- చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న ఆయాలు 2,576
- తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న ఆయాలు 2,361
- చిత్తూరు జిల్లాలోని నైట్ వాచ్‌మెన్‌లు 1,756
- తిరుపతి జిల్లాలోని నైట్ వాచ్‌మెన్‌లు 1,879

పట్టించుకోని ఉన్నతాధికారులు

జీతాల పెండింగ్ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని చిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాయకుల సాయంతో కలెక్టరేట్ వద్ద ధర్నాలు నిర్వహించినప్పటికీ ఏ మాత్రం స్పందన లేదని చెబుతున్నారు. జీతాల సమస్యపై వినతి పత్రం ఇస్తే ఏ మాత్రం ఉలుకూ పలుకూ లేదని కన్నీరు మున్నీరవుతున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు చొరవ తీసుకుని పెండింగ్‌లో ఉన్న జీతాలను మంజూరు చేయించేలా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

జీతాలు పెండింగ్ తగదు



ప్రభుత్వ బడుల్లో పొట్టకూటి కోసం పనిచేస్తున్న ఆయాలు, నైట్‌వాచ్‌మెన్‌ల జీతాలను నాలుగు నెలలుగా మంజూరు చేయకపోవడం దారుణం. ఈ కొత్త ప్రభుత్వం వ్యవహరిస్తున్న విధానం సమంజసం కాదు. జీతాలు లేకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేక అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను కలెక్టర్లు ప్రత్యేక చొరవతో పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాం.

– సురేంద్ర, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

విద్యాశాఖ అధికారులు స్పందించాలి



ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌ల జీతాల సమస్యను విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలి. చిరుద్యోగుల జీతాల మంజూరుపై ఈ కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలి. నెల జీతం లేకపోవడంతో ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌లు వడ్డీకి అప్పులు తీసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఉండేది కాదు.

– సద్దాం, విద్యార్థి సంఘం నాయకుడు, చిత్తూరు జిల్లా

పీవీకేఎన్‌కు ఐఎస్‌ఓ కొనసాగింపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐఎస్‌ఓ గుర్తింపు కొనసాగింపు లభించినట్లు ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి తెలిపారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని స్వయంప్రతిపత్తి హోదా కలిగిన పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బెస్ట్ ఎడ్యుకేషనల్ సర్వీస్ సెంటర్ గా, గ్రీనరీ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్రమోషన్, ఎనర్జీ సేవింగ్ ప్రాక్టీసెస్ అనే మూడు అంశాలకు అంతర్జాతీయ సంస్థ ఐఎస్‌ఓ గుర్తింపు ఇచ్చిందన్నారు. ఈ గుర్తింపు పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాలకు దక్కడం గర్వకారణమని తెలిపారు. ఐఎస్‌ఓ పత్రాన్ని ఎస్వీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ భూపతినాయుడు ప్రిన్సిపల్‌కు అందజేశారు.



గుర్తింపు పత్రం అందుకుంటున్న ప్రిన్సిపల్ జీవనజ్యోతి

ఆ కళాశాల వైస్ ప్రిన్సిపల్ మీరాసాహేబ్, నాక్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్, అకడమిక్ కో–ఆర్డినేటర్ భానుప్రకాష్, ఎన్‌ఆర్‌సీ కో–ఆర్డినేటర్ జయచంద్రుడు, పరీక్షల విభాగం ఇన్‌చార్జి శరవణ హర్షం వ్యక్తం చేశారు.

21 నుంచి ఎలక్టోరల్ సవరణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 21వ తేదీ నుంచి ఎలక్టోరల్ సవరణ చేపట్టనున్నట్లు డీఆర్‌ఓ పుల్లయ్య అన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని తెలిపారు. 2025 జనవరి 1 వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదుకావాలని కోరారు. నూతన ఓటరు నమోదు, పాత ఓటరు జాబితాలో సవరణకు జిల్లాలో సిద్ధం చేసే వివరాలు అక్టోబర్ 3న సీఈఓకు పంపాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయిలో ఈ ప్రక్రియను అక్టోబర్ 19 నాటికి పూర్తి చేసి అక్టోబర్ 29 న ముసాయిదా ఓటర్ల జాబితా



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ పుల్లయ్య

విడుదల చేస్తారని చెప్పారు. 2025 జనవరి 6వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారన్నారు. నవంబర్ 9, 10, 23, 24 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా బీఎల్‌ఓలు పోలింగ్ స్టేషన్‌లలో అందుబాటులో ఉంటారని చెప్పారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ రాజశేఖర్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉదయ్, సురేంద్రకుమార్, అట్లూరి శ్రీనివాసులు, గంగరాజు, పరదేశి పాల్గొన్నారు.

వ్యర్థం.. అనర్థం

''చిత్తూరు నగరంలోని డంపింగ్‌యార్డులో ఇటీవల అగ్నిప్రమాదం జరగడంతో పెద్దస్థాయిలో మంటలు వ్యాపించాయి. ఈ మంటలను అదుపులోకి తీసుకురావడానికి అగ్నిమాపక సిబ్బంది, కార్పొరేషన్ సిబ్బంది కలిసి మూడురోజుల పాటు శ్రమించాల్సి వచ్చింది. అయితే ఇంత భారీగా మంటలు రావడానికి ఇక్కడ ఉన్న చెత్తతో పాటు శానిటరీ న్యాప్‌కిన్లు, డైపర్లు కాలడంతో రసాయన చర్య జరిగి పర్యావరణానికి, ప్రాణులకు హాని కలిగించే పలు విష వాయువులు వెలువడ్డాయి.''

- శానిటరీ వ్యర్థాలను నిర్లక్ష్యంగా వాడి పడేస్తున్న జనం
- యార్డుల్లో అగ్నిప్రమాదాలతో భారీగా రసాయనాలు
- ప్రజారోగ్యం.. పర్యావరణానికి ఊహించని నష్టం
- జిల్లాలో పెరిగిన శానిటరీ వస్తువుల వినియోగం
- పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యానికీ తప్పని ముప్పు
- నియంత్రించకపోతే ప్రమాదం తప్పదంటున్న డబ్ల్యూహెచ్‌ఓ



చిత్తూరు డంపింగ్‌యార్డులో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

చిత్తూరు అర్బన్: పట్టణాలు, నగరాల్లో రోజూ తెల్లవారుజామునే విజిల్స్ వేస్తూ కాలనీల్లో మున్సిపల్ కార్మికులు ఇంటింటా చెత్త తీసుకెళ్తుంటారు. ఓ వైపు విజిల్స్ వేస్తూనే.. ప్రతీ ఇంటి వద్ద చెత్త తీసింది.. లేనిది తెలుసుకోవడానికి స్కానర్లు కూడా వాడుతూ అధికారులు దీన్ని పర్యవేక్షిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. మరి చెత్తతో పాటు వచ్చిపడే శానిటరీ న్యాప్‌కిన్లు వేరు చేస్తున్నారా..? పిల్లలకు వాడే డైపర్లను ప్రత్యేకంగా సేకరిస్తున్నారా ? అంటే లేదనే చెప్పాలి. రసాయనాలతో తయారయ్యే వీటిని ఎక్కడ పడితే అక్కడ కాల్చేస్తూ సమస్య నుంచి తాత్కాలికంగా బయట పడుతున్నామని అనుకుంటున్నా.. మున్సిపాలిటీలు అసలు సమస్యను సృష్టిస్తున్నాయి.

భారీగా పోగవుతున్న వ్యర్థాలు..

సాధారణంగా మన ఇంట్లో వాడే న్యాప్‌కిన్లు, డైపర్లు, గాయాలకు ఉపయోగించే బ్యాండేజీలు ఇలా ఆరోగ్యపరంగా మనం జాగ్రత్తలు తీసుకునే క్రమంలో వెలువడే వ్యర్థాలు (శానిటరీ వ్యర్థాలు) మున్సిపాలిటీల్లో పక్కదారి పడుతున్నాయి. వీటిని ప్రత్యేకంగా సేకరించే విధానమేదీ లేకపోవడం, ప్రత్యేకంగా వీటిని కార్మికుల చేతికి ఇవ్వాలని పట్టణ ప్రజలకు ఆలోచన రాకపోవడంతో మామూలు చెత్తలోనే కలిపి ఇస్తున్నారు. ఫలితంగా అగ్ని ప్రమాదాలు జరిగినపుడు రసాయనాలు, ఇతర ప్రమాదకర కారకాలు కాలుతూ అందర్నీ కాల్చేస్తోంది. చిత్తూరు కార్పొరేషన్‌తో పాటు పలమనేరు, పుంగనూరు, కుప్పం, నగరి మున్సిపాలిటీల్లో రోజుకు సగటున 131 మెట్రిక్ టన్నుల ఘన వ్యర్థాలు ఉత్పత్తి అవుతుంటే వీటిలో 0.94 టన్నుల వరకు శానిటరీ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నట్లు అంచనా. చిత్తూరు లాంటి కార్పొరేషన్‌లో రోజుకు వేలాదిగా న్యాప్‌కిన్లు, డైపర్లు రోజువారీ చెత్తతో తీసుకుంటూ డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. కొన్ని మున్సిపాలిటీల్లో శానిటరీ వ్యర్థాలను ఎక్కడికక్కడ కాల్చేస్తున్నారు. కానీ ఇవి కాలడం వల్ల వ్యర్థాల్లో ఉండే రసాయన పదార్థాలు, రక్తపు మరకలు, మలమూత్ర వ్యర్థాల వల్ల పర్యావరణంతో పాటు ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉత్పన్నమవుతున్న వ్యర్థాలను ఏజెన్సీల ద్వారా సేకరించి ఓ శాస్త్రీయ పద్ధతిలో ధ్వంసం చేస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రులు చాలా వరకు చెత్తకుప్పల్లో మెడికల్ వేస్ట్‌ను పడేసి చేతులు దులుపుకుంటున్నారు. దీనిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉదారత ప్రజలకు శాపంగా మారుతోంది.

ఇలా చేస్తే...!

శానిటరీ ప్యాడ్లు, న్యాప్‌కిన్లు, డైపర్లను ఒక పాత న్యూస్ పేపర్లలో గానీ, ఇతర పేపర్‌లో గానీ చుట్టి దాని మీద ఎర్రటి మార్కర్‌తో ఓ గుర్తును వేయాలి. ఒక ప్యాక్‌లా తయారు చేసి ఎర్రటి మార్కర్‌తో బొట్టులా దిద్ది పారిశుద్ధ్య కార్మికుల చేతికి ఇవ్వాలి. దీన్ని కార్మికులు సురక్షితంగా పక్కన పెట్టి తీసుకెళ్తారు. అనంతరం వీటిని భూమితో పాతిపెట్టడం, శాస్త్రీయ పద్ధతుల్లో కాల్చడం చేస్తే పర్యావరణానికి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండదు.

రీసైకిల్ ఉండదు..

డైపర్లు, న్యాప్‌కిన్లు రీసైకిల్ చేసేందుకు వీలుండదు. వీటిని జాగ్రత్తగా సేకరించి భూమిలో శాస్త్రీయంగా పాతేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో సేకరించే శానిటరీ వ్యర్థాలను కొన్ని కంపెనీలు ఓ శాస్త్రీయ పద్ధతిలో కాలుస్తాయి. అలా కాకుండా బహిరంగ ప్రదేశాల్లో, చెత్తకుప్పల్లో వీటిని పొరపాటున కాల్చినా రసాయనాలు వెలువడే ప్రమాదం ఉంది. చాలాచోట్ల వీటిని స్థానిక ప్రజలు కాల్చేస్తున్నారు. ఫలితంగా చుట్టుపక్కలు ఉన్న గ్రామాలు, కాలనీలకు వీటి నుంచి విషం వెలువడుతోందనే వాస్తవాన్ని గ్రహించడం లేదు.

జిల్లాలోని మున్సిపాలిటీల్లో చెత్త నిర్వహణ ఇలా..

మున్సిపాలిటీ	జనాభా (సుమారు)	రోజుకు పోగయ్యే చెత్త (సగటు మెట్రిక్ టన్నుల్లో)
చిత్తూరు కార్పొరేషన్	2.07 లక్షలు	66.03
పలమనేరు	72 వేలు	17.52
పుంగనూరు	61 వేలు	13.62
కుప్పం	46 వేలు	21.07
నగరి	62 వేలు	13.51

శానిటరీ వ్యర్థాలు ఏవంటే..!

శానిటరీ ప్యాడ్లు, నాప్‌కిన్లు, డైపర్లు, రక్తంతో తడిచిన దుస్తులు, సూదులు, సిరంజీలు, బ్యాండేజీలు, కండోమ్‌లు లాంటివన్నీ శానిటరీ వ్యర్థాల కిందకే వస్తాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన ఓ పరిశోధన ప్రకారం ఈ వ్యర్థాలను బహిరంగంగా పడేయడం వల్ల కంటి, శ్వాశ, చర్మ, జీర్ణాశయ సంబంధిత వ్యాధులు వస్తాయని హెచ్చరించింది. మొదట పారిశుధ్య కార్మికులు ఇలాంటి రుగ్మతలకు గురవుతున్నారు. హెపటైటిస్, ఈకోలి, థైరాయిడ్, క్యాన్సర్ లాంటి సమస్యలు ఎక్కువగా పారిశుద్ధ్య కార్మికుల్లో కనిపిస్తున్నాయని వెల్లడించింది.

అవగాహన కల్పిస్తాం..



శానిటరీ వ్యర్థాలను వేరుగా సేకరించడంపై మా కార్మికులకు, ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మాదే. వీటి సేకరణకు ఓ ప్రత్యేక డబ్బా ప్రవేశపెడతాం. ఈ వ్యర్థాలను నేరుగా చేతుల్లోకి తీసుకోకుండా ఇప్పటికే గ్లౌజులు ఇచ్చాం. శాస్త్రీయ పద్ధతిలో ఈ వ్యర్థాలను ధ్వంసం చేసే విధానాలను పరిశీలిస్తున్నాం. ఏటా కార్మికుల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవడానికి కార్పొరేట్ తరహా ఉచిత వైద్యశిబిరాలు పెడుతూ, చికిత్సలు కూడా అందిస్తున్నాం.

– అరుణ, కమిషనర్, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్

గ్రామసభలకు పకడ్బందీ ఏర్పాట్లు



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డ్వామా పీడీ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో గ్రామ సభలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు డ్వామా పీడీ రాజశేఖర్ తెలిపారు. గ్రామ సభల నిర్వహణ ఏర్పాట్లపై సోమవారం విజయవాడ నుంచి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అందులో డ్వామా పీడీ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 23వ తేదీ నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ గ్రామ సభల నిర్వహణకు గ్రామ పంచాయతీల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉపాధి హామీలో 46 రకాల పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ వంద రోజుల పనిదినాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. గ్రామ సభల నిర్వహణపై ఇప్పటికే కలెక్టర్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి సిబ్బంది పకడ్బందీ ఆదేశాలు ఇచ్చినట్లు వివరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ గ్లోరియా, డీపీఓ లక్ష్మీ, పీఆర్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీపీఆర్సీ కో–ఆర్డినేటర్ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శభాష్ డాక్టరమ్మ

గుడిపాల: వైద్యరంగంలోనే ఓ అద్భుతాన్ని ఆవిష్కరించిన ఈ డాక్టరమ్మ స్థానికులు, సహచరుల అభినందనలు అందుకున్నారు. సాధారణంగా తొలికాన్పులో సిజేరియన్ అయితే రెండో సారి కూడా సిజేరియన్ చేసేస్తారు. అయితే స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ సంధ్య సాహసోపేతంగా సాధారణ ప్రసవం చేశారు. వివరాల్లోకి వెళితే, మండలంలోని పెద్దిశెట్టిపల్లె పంచాయతీ దిగువ ఊరుకు చెందిన వేండా అనే మహిళకు చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో తొలి ప్రసవంలో సిజేరియన్ చేశారు. ఆమె రెండో సారి గర్భం దాల్చింది. ఈ సారి కూడా సిజేరియన్ తప్పదని వైద్యులు స్పష్టంగా చెప్పేశారు. దీంతో వారు కూడా సిజేరియన్‌కు సిద్ధపడ్డారు. అయితే గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన ఆ మహిళకు డాక్టర్ సంధ్య సాధారణ ప్రసవం చేయడానికి ప్రయత్నించారు. స్టాఫ్‌నర్స్ నాగలక్ష్మి డాక్టర్‌కు సంపూర్ణ సహకారం అందించారు. వీరు సుమారు గంటపాటు కష్టపడి చివరకు సుఖ ప్రసవం చేశారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. పుట్టిన ఆడబిడ్డ బరువు 3.5 కిలోలుగా ఉంది. ఈ విషయాన్ని చిత్తూరు డీఎంహెచ్‌ఓ ప్రభావతి దృష్టికి తీసుకువెళ్లగా ఆమె కూడా ఆశ్చర్యపోయి డాక్టర్ సంధ్యకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 31 ఫిర్యాదులు



సమస్యలు వింటున్న ఏఎస్పీ ఆరీఫుల్లా

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని ఏఆర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు 31 ఫిర్యాదులు అందాయి. సోమవారం ఏఎస్పీ ఆరీఫుల్లా ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. వీటిల్లో భూ తగాదాలు, మోసాలు, ఆర్థిక లావాదేవీలు, కుటుంబ తగాదాలు, వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులున్నాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఆడిట్

చిత్తూరు కార్పొరేషన్:జిల్లా గ్రామీణ నీటిసరఫరా శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్)లో ఆడిట్ పనులు మొదలయ్యాయి. గత ప్రభుత్వం హయాంలో జరిగిన మొత్తం పనుల వివరాలను ఏపీ ఆడిట్ జనరల్ కార్యాలయ అధికారుల బృందం తనిఖీ చేస్తోంది. జిల్లాలో శాఖాపరంగా జరిగిన పనుల రికార్డులను సేకరిస్తున్నారు. ఏ పనులకు ఎంత నిధులు ఖర్చు పెట్టారు వాటి వివరాలను నమోదు చేస్తున్నారు.



ఈ ఖరీఫ్‌లో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. పెట్టుబడులు పెరిగిపోతుండడంతో ఆశించిన మేర సాగుకు నోచుకోలేదు. ఫలితంగా వ్యవసాయ భూములన్నీ బీళ్లుగా మారిపోయాయి. గతంలో పచ్చని పంటలతో అలరారిన భూములన్నీ ఇప్పుడు నోరెళ్లబెడుతున్నాయి. వ్యవసాయ రంగాన్ని పట్టించుకోని ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో పెరిగిన ఖర్చులు చూసి భయపడిన సన్న, చిన్న కారు రైతులు, మోతుబరి రైతులు కూడా పంటలను వేసేందుకు ముందుకు రావడం లేదు. అప్పులు చేసి సాగు చేసినా ఫలితం దక్కుతుందో లేదో అన్న అనుమానంతో అన్నదాతలు సాగుకు వెనకడుగువేస్తున్నారు.



కార్వేటినగరం మండలంలో పంటలు లేక బీళ్లుగా మారిన వ్యవసాయ భూములు

బీళ్లుగా పంట భూములు

- రైతులను పట్టించుకోని ప్రభుత్వం
- పెట్టుబడులు పెట్టలేక కష్టతరంగా సేద్యం
- గణనీయంగా తగ్గిపోయిన సాగు విస్తీర్ణం

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలో మొత్తం 2.40 లక్షల రైతు కుటుంబాలు ఉన్నాయి. వీరు ఏటా మొత్తం 1.35 లక్షల హెక్టార్ల సాధారణ విస్తీర్ణంలో పలు రకాల పంటలను సాగు చేస్తారు. అందులో ఖరీఫ్ సీజనులో దాదాపు 85,450 వేల హెక్టార్లు, రబీ సీజనులో 50 వేల హెక్టార్ల సాధారణ విస్తీర్ణంలో అన్ని రకాల పంటలు వేస్తారు. ఇవి కాకుండా ఉద్యాన పంటల కింద మొత్తం 68 వేల హెక్టార్లలో మామిడి తోటలున్నాయి. ఖరీఫ్ సీజనులో ప్రధానంగా వర్షాధార పంటగా వేరుశనగను 43 వేల హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేస్తారు. ఇక రబీ సీజనులో ప్రధానంగా రైతులు వరి పంటను దాదాపు 35 వేల హెక్టార్ల విస్తీర్ణంలో పండిస్తారు. దీంతో ఏటా రెండు సీజన్లలో సాధారణ విస్తీర్ణం మేరకు అన్ని రకాల పంటలు సాగు చేయాలంటే రైతులు దాదాపు రూ. 1,000 కోట్ల నుంచి రూ.1,250 కోట్ల మేరకు పెట్టుబడులు పెట్టాల్సి ఉంది. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పంటల సాగుకు ఏటా ప్రతి రైతుకు మూడు విడతల్లో రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయాన్ని ముందస్తుగా అందించి ఆదుకునేది. దీంతో రైతులు ఎంతో ఉత్సాహంతో ఏటా సాధారణ విస్తీర్ణంలో దాదాపు 80 శాతానికి తక్కువ లేకుండా పంటలను సాగు చేసేవారు. ప్రస్తుత ప్రభుత్వం పంటల సాగుకు ముందస్తు పెట్టుబడిని అందించడంలో మొండిచేయి చూపింది. ఫలితంగా రైతులు పెట్టుబడులు పెట్టలేని దుస్థితిలో పంటలను సాగు చేయలేక అవస్థలు పడుతున్నారు.

పెట్టుబడుల భారం

పెట్టుబడుల భారం పెరగడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయి, వ్యవసాయ భూములన్నీ బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. దుక్కుల మొదలు విత్తనం, కలుపుతీత, కోతలు, నూర్పిడి వరకు అధిక మొత్తాల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. దుక్కులు దున్నేందుకు ట్రాక్టర్‌కు గంటకు రూ.900 నుంచి రూ.1,200 మేరకు, ఒక కూలీకి రోజుకు రూ.500 వరకు వెచ్చించాల్సి ఉంది. విత్తనాలకు, ఎరువులు, పురుగు మందులు తదితరాలకు అధిక మొత్తాల్లో పెట్టుబడి పెట్టాల్సి ఉంది. దీంతో ఎకరా స్థలంలో వరి సాగు చేయాలంటే దుక్కులకు రూ.9 వేలు, విత్తనాలకు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు వెచ్చించాలి. ఇవేగాక పంట సాగులో యాజమాన్య పద్ధతులకు కూలీలు, ఎరువులు, మందులు, కోతలు, నూర్పిడి తదితరాలకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చవుతుంది. చెరకు పంట సాగు చేయాలంటే మూడు దఫాల దుక్కులకు రూ. 3 వేలు, విత్తనం రూ.9 వేలు, బెల్లం తయారీకి, కూలీల ఖర్చుతో కలిపి రూ. 40 వేల నుంచి రూ. 50 వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంది.



ఎస్ఆర్ పురం మండలంలో బీడు భూములు

చీడ పీడల బెడద

పంటల సాగు సమయంలో ప్రకృతి వైపరీత్యాలు, చీడ పీడల కారణంగా దిగుబడి మీద ప్రభావం చూపే అవకాశం ఉంది. యాజమాన్య పద్ధతుల్లో పంటలకు ఎరువుల వాడకానికి, చీడ పీడలు ఆశించకుండా మందుల పిచికారీకి అధిక మొత్తాల్లో పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. దీనికి తోడు వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే సాగైన పంటలను అర్ధాంతరంగా వదులుకోవాల్సిన దుస్థితి. ఇలాంటి పరిస్థితుల కారణంగా రైతులు పంటలు వేసేందుకు వెనకాడుతున్నారు.

వేరుశనగ సాగుకు రూ.25 వేలు

ఖరీఫ్‌లో వర్షాధార వేరుశనగ పంట ఎకరా సాగుకు మూడు దఫాల దుక్కులు రూ. 3 వేలు, విత్తనాలు రూ. 3 వేలు , యాజమాన్య పద్ధతులు, నూర్పిడి తదితరాలకు కలిపి మొత్తం రూ. 20 వేల నుంచి రూ. 25 వేల వరకు ఖర్చవుతుంది. పడమటి మండలాల్లో అత్యధికంగా సాగు చేసే టమాటా పంట సాగుకు ఎకరా విస్తీర్ణంలో మూడు దఫాలు దుక్కులకు రూ. 3 వేలు, విత్తన మొలకలకు రూ. 3,500 , యాజమాన్య పద్ధతులు, కోతలకు మొత్తం రూ. 90 వేల నుంచి రూ. లక్ష వరకు ఖర్చవుతుంది. అధిక మొత్తాలు పెట్టి పంటలు సాగు చేసినా దిగుబడి ఆశించిన మేరకు చేతికందే పరిస్థితులు లేవు.

ప్రభుత్వ సాయం నిల్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయాభివృద్ధికి పెద్దపీట వేసి ఆదుకుంది. ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో పంటల సాగుకు ముందస్తుగానే పెట్టుబడి సాయాన్ని అందించి తోడ్పాటును అందించింది. ప్రతి ఏటా మూడు విడతల్లో రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాల ద్వారా ప్రతి రైతుకు రూ.13,500 చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేసింది. ఈ ప్రక్రియతో జిల్లా వ్యాప్తంగా ఏటా మొత్తం 2.32 లక్షల రైతు కుటుంబాలకు దాదాపు రూ. 313 కోట్ల మేరకు పంటల సాగుకు ముందస్తు పెట్టుబడి నిధిని అందజేసింది. ఈ లెక్కన గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వ పథకాల ద్వారా మొత్తం రూ.1,423.88 కోట్ల మేరకు అందజేసి ఆదుకుంది. దీంతో ఏటా పంటల సాగు సాధారణ విస్తీర్ణంలో దాదాపు 80 శాతానికి తగ్గకుండా పంటలను సాగులోకి తీసువచ్చి వ్యవసాయాన్ని పండుగలా మార్చారు. అయితే ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం మాత్రం పెట్టుబడి సాయాన్ని అందజేసేందుకు ఆసక్తి చూపకపోగా వ్యవసాయాభివృద్ధికి ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఏటా ప్రతి రైతు కుటుంబానికి రూ. 20 వేల ఆర్థిక సాయాన్ని అందజేస్తామని ఎన్నికల హామీలు గుప్పించి, తీరా గద్దెనెక్కాక మొండి చేయి చూపింది. ఫలితంగా రైతులు పంటల సాగు పట్ల ఆసక్తి చూపడం లేదు.

గణనీయంగా తగ్గిన సాగు

ఈ ఖరీఫ్ సీజను ప్రభుత్వ సహకారం ఏమాత్రం లేకపోవడంతో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. సాధారణ విస్తీర్ణంలో కనీసం 45 శాతం మేరకు కూడా రైతులు సాగులోకి తీసుకురాలేక పోయారు. ఈ సీజనుకు మొత్తం 81,169 హెక్టార్ల విస్తీర్ణంలో అన్ని రకాల పంటలను సాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు. అయితే అందులో కేవలం 34,796 హెక్టార్లలో మాత్రమే వివిధ రకాల పంటలను సాగు చేయగలిగారు. వేరుశనగ పంటను మొత్తం 43,174 హెక్టార్ల విస్తీర్ణానికి గాను ఇప్పటికీ 13,166 హెక్టార్లు మాత్రమే సాగు చేశారు. వరి పంటను 9,704 హెక్టార్లకు గాను 4,223 హెక్టార్లు, రాగి 3,101 హెక్టార్లకు గాను 465 హెక్టార్లు, కందులు 3,261 హెక్టార్లకు గాను 657 హెక్టార్లు, చెరకు 8,526 హెక్టార్లకు గాను 3,824 హెక్టార్లు, ఇతర పంటలు 13,403 హెక్టార్లకు గాను 12,461 హెక్టార్ల మేరకు మాత్రమే సాగులోకి తీసుకువచ్చారు.

తమ్ముడి హత్య కేసులో అన్న అరెస్టు

పెద్దపంజాణి: సొంత తమ్ముడిని హత్య చేసిన కేసులో మట్టిగానిపల్లికి చెందిన కె. వెంకటరమణను ఆదివారం సాయంత్రం అరెస్టు చేసినట్లు పలమనేరు రూరల్ సీఐ మురళీమోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు, మండలంలోని లింగాపురం పంచాయతీ మట్టిగానిపల్లెకు చెందిన లేట్ లక్ష్మయ్య కుమారులు కె.వెంకటరమణ, చెంగయ్యకు గత కొంత కాలంగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో గత శనివారం రాత్రి సుమారు 7 గంటల సమయంలో అన్న వెంకటరమణ, తమ్ముడు చెంగయ్య ఇంటి వద్ద ఉండగా కొడవలి కొంకీతో తల, రొమ్ముపై నరికి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన చెంగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు పరారీలో ఉన్న నిందితుడిని ఆదివారం సాయంత్రం తులసమ్మ గుడి సమీపంలోని బస్టాప్ వద్ద అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కొంకీని స్వాధీనం చేసుకుని రిమాండు నిమిత్తం సోమవారం పుంగనూరు కోర్టులో హాజరు పరచినట్లు సీఐ పేర్కొన్నారు. ఎస్‌ఐ సహదేవి, సిబ్బంది మురళీ రాజు, గుణ, వెంకట్రమణ, రవి పాల్గొన్నారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ మురళీమోహన్, ఎస్‌ఐ సహదేవి, సిబ్బంది

రెండు రోజులుగా కరెంట్ కట్

గంగవరం: మండలంలోని కలుపల్లె లో ఆదివారం రాత్రి నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో అంధకారంగా మారింది. విద్యుత్ అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేసినా వారు స్పందించలేదు. దీంతో సంబంధిత ప్రాంతంలో దుకాణదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ కరెంటు లేకపోవడంతో నిద్ర పట్టక దోమల బాధతో అవస్థలు పడుతున్నారు. తరుచూ విద్యుత్ సమస్యలు ఎదురవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదు. దీంతో స్థానికులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన అనంతరం ఆందోళన చేయడానికి సిద్ధమవుతున్నారు.



కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

లారీ బోల్తా: ఒకరి మృతి

బంగారుపాళెం: మండల పరిధిలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై లారీ బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు, శ్రీనివాసపురం నుంచి భువనేశ్వర్‌కు టమాటా సాస్ డ్రమ్‌లను తరలిస్తున్న లారీ మొగిలి వద్దకు రాగానే బ్రేక్ ఫెయిల్ అవడంతో రోడ్డు దాటుతున్న మొగిలికి చెందిన జ్యోతికుమార్(55)ను ఢీకొంది. తరువాత మరో వాహనాన్ని ఢీకొని పక్కనే ఉన్న కల్వర్టులోకి వెళ్లి బోల్తాపడింది. ఈ ఘటనలో జ్యోతికుమార్ సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. సింగరాయకొండకు చెందిన లారీ డ్రైవర్ షేక్ ఉస్మాన్, నెల్లూరుకు చెందిన క్లీనర్ వెంకటసుబ్బయ్య తీవ్రంగా గాయపడ్డారు. లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కు పోవడంతో జేసీబీ సాయంతో బయటకు తీశారు. క్షతగాత్రులను 108 సిబ్బంది చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మొగిలి వద్ద బోల్తాపడిన లారీ

పేకాట స్థావరంపై దాడి : 28 మంది అరెస్టు

తవణంపల్లె: మండలంలోని పేకాట స్థావరంపై చిత్తూరు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఆదివారం రాత్రి చాకచక్యంగా దాడి చేసి 28 మందిని అరెస్టు చేశారు. అక్కడ ఉన్న వాహనాలు, రూ.2.24 లక్షల నగదు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాట స్థావరంలో రూ.2.24 లక్షల నగదు, 9 మోటారు సైకిళ్లు, 26 మొబైల్ ఫోన్లు, 52 పేకలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు, మండలంలోని గాజులపల్లెలో వారం రోజులుగా మహాభారత యజ్ఞం కొనసాగుతోంది. దీనికి సమీపంలోని ఓ మామిడి తోటలో పేకాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో స్పెషల్ బ్రాంచ్ సీఐ మనోహర్, ఎస్‌ఐ అనిల్ కుమార్ నేతృత్వంలో ఎస్‌టీఎఫ్ సిబ్బందితో కలిసి ఆదివారం రాత్రి పేకాట స్థావరంపై మెరుపు దాడిచేశారు. అక్కడున్న వారందరినీ అదుపులోకి తీసుకున్నారు. పేకాట స్థావరంలో రూ.2,24,290 నగదు, 9 మోటారు సైకిళ్లు, 26 మొబైల్ ఫోన్లు, 52 పేకలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో మండలంలోని దిగువమాఘంకు చెందిన కె.చైతన్య(35), దిగువతడకరకు చెందిన రజిని అలియాస్ కబాలి(49), వెంగంపల్లెకు చెందిన కె.లోకనాథరెడ్డి(46), చెర్లోపల్లెకు చెందిన కె.నేతాజీ(44), విజయ్‌భాస్కర్‌రెడ్డి(56), గోవిందరెడ్డిపల్లెకు చెందిన ఎం.బాబు(62), గురుకవారిపల్లెకు చెందిన ఏ.మోహన్(62), బోయపల్లెకు చెందిన కె.రాజయ్య(70), ఈచనేరికి చెందిన వి.జయబాబు(43), గాజులపల్లెకు చెందిన ఎస్.అన్వర్(40), కె. చంద్రశేఖర్‌శెట్టి(67), ఎస్.రసూల్‌బాషా, చారాలకు చెందిన సీ. సుబ్రమణ్యం(70), గోవిందరెడ్డిపల్లెకు చెందిన ఎం.చిన్నబ్బ(65), చారాలకు చెందిన వి.మురళి(43), గాజులపల్లెకు చెందిన ఎస్.మురళి(49), అరగొండకు చెందిన ఎం.మురగ(46), గాజులపల్లెకు చెందిన మొగిలప్ప(67), యాదమరి మండలం బొమ్మలచేనుకు చెందిన కె.శ్రీకృష్ణ(35), పలమనేరుకు చెందిన అస్లాం బాషా(33), చిత్తూరు నగరం కొండారెడ్డిపల్లెకు చెందిన కె.వేణుగోపాల్(62), ఎన్.బాలసుబ్రమణ్యం(53), ఇరువారానికి చెందిన డీ.చిన్న(34), బంగారుపాళెం మండలం తగ్గువారిపల్లెకు చెందిన రాజశేఖర్(35), ఎం.మణి(30), తుంబకుప్పానికి చెందిన బి.చిట్టిబాబు(45), శెట్టేరికి చెందిన కె.డిల్లీబాబు(45), సాగర్(28) ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

సారా విక్రేత అరెస్ట్

గుడిపాల: సారా విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు, గట్రాళ్లమిట్టకు చెందిన ఉయినా(58 కొంతకాలంగా సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో సోమవారం గట్రాళ్లమిట్టలో వాళ్ల ఇంటి వద్ద 8 లీటర్ల సారా ఉండడంతో ఆమెను అరెస్ట్ చేశారు.

కలెక్టర్‌కు వినతుల వెల్లువ

- ప్రజా సమస్య వేదికకు 113 అర్జీలు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీలు వెల్లువలా వచ్చాయి. సుమిత్ కుమార్ గాంధీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను సత్వరం పరిష్కరించాలన్నారు. అర్జీదారుల సమస్యను ఓపికతో తెలుసుకుని పరిశీలించాలన్నారు. అధికారులు జవాబుదారీతనంగా పనిచేయాలని ఆదేశించారు. ఇందులో వివిధ శాఖలకు సంబంధించి 113 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. రెవెన్యూ శాఖ 104, రిజిస్ట్రేషన్ శాఖ 1, ఐసీడీఎస్ 1, డీపీఓ 2, డీఎస్ఓ 2, డీసీహెచ్ఎస్ 1, హెచ్ఎస్ఎస్ఎస్(హంద్రీ-నీవా) మదనపల్లి 1, సాంఘిక సంక్షేమ శాఖ 1 మొత్తం 113 అర్జీలు నమోదయ్యాయి. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భూమి ఆక్రమించుకున్నారు




తన భూమిని ఆక్రమించుకున్నారని పెనుమూరు మండలం తాటిమాకులపల్లికి చెందిన బి వెంకటముని ఆయన భార్య బి.లక్ష్మమ్మ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తమకు గుంటిపల్లి గ్రామంలో సర్వే నెంబరు 1023లో 0.74 సెంట్ల భూమి ఉందన్నారు. ఆ భూమిని నాగరాజు, గోవిందయ్య ఆక్రమించుకుని బెదిరిస్తున్నట్లు తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

పింఛన్ ఇప్పించండయ్యా




పుట్టుకతోనే వికలాంగుడైన తనకు రూ.15 వేలు పింఛన్ ఇప్పించాలని వి.కోట మండలం ఎగువ గోదార మాముర్లకు చెందిన శీనప్ప కలెక్టర్‌ను కోరారు. ఆయన మాట్లాడుతూ తనకు పుట్టినప్పటి నుంచి వైకల్యం ఉండడంతో మంచానికే పరిమితమయ్యాయని తెలిపారు. తల్లి దండ్రులు కూలి పనులు చేస్తుంటారని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన సదరన్ సర్టిఫికెట్‌లో 90 శాతం వైకల్యం ఉందని తెలిపారు. ప్రస్తుతం తనకు వస్తున్న రూ.6 వేలు పింఛన్‌ను పెంచి రూ.15 వేలు ఇప్పించాలని కోరారు.

ఉద్యోగం వచ్చాక పట్టించుకోలేదు



తన కుమారుడి ఉద్యోగం పొందిన కోడలు తమను పట్టించుకోవడం మానేసిందని బాధితురాలు కస్తూరి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసింది. ఆమె మాట్లాడుతూ తన కుమారుడు శ్యామ్ వ్యవసాయ శాఖలో పనిచేస్తూ 2011లో అకాలమరణం చెందారన్నారు. ఆ తర్వాత తన కుమారుడి ఉద్యోగం కోడలికి వచ్చిందని చెప్పారు. ఉద్యోగం వచ్చాక కోడలు రేఖ తమను ప్రస్తుతం పట్టించుకోవడం లేదన్నారు. ఉద్యోగం రాక ముందు జీవనాధారం కోసం నెలకు రూ.5 వేలు ఇస్తామని కోడలు చెప్పిందన్నారు. ఉద్యోగం వచ్చాక మాట మార్చేసిందని ఆవేదన వ్యక్తం చేసింది.

ఓడీని రద్దు చేయండి



తమ ఓడీని రద్దు చేసి సొంత జిల్లా అనంతపురం పంపించాలని ఏపీ బహుళ ప్రయోజన విస్తరణ అధికారులు రెడ్డిప్రసాద్, నాగరాజులు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. వారు మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో విస్తరణాధికారులుగా పని చేస్తున్న తమను ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ఓడీ పద్ధతిలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు పంపించారని చెప్పారు. తాము గత పదేళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిత్తూరు జిల్లాలో రైతు కేంద్రాలు ఎక్కువగా ఉండడంతో తమను ఓడీ పద్ధతిలో ఇక్కడికి పంపించారన్నారు. అయితే 5 నెలలుగా తమకు జీతాలివ్వడం లేదని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు.

అశ్రునయనాలతో తల్లీబిడ్డకు వీడ్కోలు

- కాటిపేరిలో విషాదం
- తరలివచ్చిన బంధుమిత్రులు



కుమార్‌రెడ్డి కుటుంబం (ఫైల్)



విలపిస్తున్న కుటుంబసభ్యులు



కుమారుడు తనీష్‌రెడ్డి

చౌడేపల్లె: నీటి గుంతలో పడి మృతి చెందిన తల్లీ కూతుళ్లకు సోమవారం స్వగ్రామంలో అశ్రునయనాలతో వీడ్కోలు పలికారు. మండలంలోని కాటిపేరిలో వేలాదిగా తరలివచ్చిన బంధుమిత్రులు, గ్రామస్తుల మధ్య వారికి అంత్యక్రియలు నిర్వహించారు. కుమార్తె అనీషారెడ్డి(7), భార్య మౌనిక(32) మృతదేహాలను చూసి భర్త కుమార్ రెడ్డి గుండెలు పగిలేలా ఏడ్చారు. ఆయన్ను ఓదార్చడం ఎవరివల్లనూ కాలేదు. మరోవైపు అసలేం జరిగిందో తెలియక బిత్తర చూపులు చూస్తున్న తనీష్‌ను చూసి స్థానికుల గుండె తరుక్కుపోయింది. గ్రామంలో ఒకే ఇంటి నుంచి రెండు మృతదేహాలు వెళ్లడంతో కుటుంబసభ్యుల ఘోష వర్ణనాతీతమైంది. గ్రామస్తులు, బంధువుల నడుమ కడసారి వీడ్కోలు పలికారు. వీరికి నివాళులర్పించడానికి వేలాది మంది ప్రజలు అక్కడకు తరలి రావడంతో కాటిపేరిలో విషాధ చాయలు అలుముకొన్నాయి.

కుటుంబ నేపథ్యం

చౌడేపల్లె మండలం కాటిపేరికి చెందిన కుమార్‌రెడ్డి ఎంఏ చదివారు. పుంగనూరుటౌన్‌లో సుమారు 10 యేళ్ల క్రితం పోలీస్ కానిస్టేబుల్ కోచింగ్ సెంటర్‌లో ఫాకల్టీగా వెళ్లేవాడు. రామసముద్రం మండలం కొండూరుకు చెందిన మౌనిక కోచింగ్ సెంటర్‌కు వస్తూ ఇద్దరి మధ్య ప్రేమ చిగురించింది. మౌనిక పట్టుదలతో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించింది. దీంతో ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. వీరికి కుమార్తె అనీషా (07), కుమారుడు తనీష్ (05) సంతానం. మౌనిక ఎక్సైజ్ శాఖలో మదనపల్లె సెబ్ -3 డిపోలో విధులు నిర్వహిస్తుండగా, భర్త కుమార్‌రెడ్డి సేద్యం చేస్తూ పాల ఆవులను మేపుతూ హాయిగా జీవనం సాగిస్తున్న ఈ కుటుంబంపై విధి పగబట్టింది. ఆదివారం రాత్రి మౌనిక కుమారుడు, కుమార్తెతో కలిసి పొలం వద్ద నుంచి పాడి ఆవులను తోలుకుని ఇంటికి బయల్దేరింది. ఆవులు నీటి కోసం ఫారం పాండ్ గుంతలోకి లాక్కెళ్లిపోయాయి. వాటితోపాటు కుమార్తె అనీషారెడ్డి నీటమునిగిపోయింది. ఆ పాపను రక్షించడానికి గుంతలోకి దూకిన మౌనిక కూడా మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటనతో ఆ గ్రామం శోకసంద్రంగా మారిపోయింది.